# "అమ్మో! నాన్నగారు వస్తున్నారు"

-- మంథా భానుమతి

"అర్ధరాత్రి..అమావాశ్య చీకటి.. కీచురాళ్ళ రొద తప్ప ఏమీ వినిపించట్లేదు. చెరువు గట్టుమీద ముగ్గురు ముసుగుమనుషులు ఫుల్ సూట్ లో ఉన్న ఒక వ్యక్తిని వెంబడిస్తున్నారు. చెరువు దాటగానే స్మశానం. ఆవ్యక్తి చేతిలొ చిన్న బాగ్ తప్ప ఇంకేమీ లేదు. డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంట్ రాజు, వాళ్ళెవరికీ కనిపించనంత దూరంలో ఏంజరుగుతుందా అని గమనిస్తూ వెనుకే వస్తున్నాడు. ఇంతలో ముగ్గురిలో ఒకడు ఫుల్ సూట్ వ్యక్తికి ఎదురుగా వెళ్ళి నించున్నాడు. ఇంకోడు కత్తి తీసి అతని మెడకి ఆనించాడు..." ఏమవుతుందా అని ఎంతో ఉత్కంఠతతో చదువుతున్న నేను ఠక్కున డిటెక్టివ్ పుస్తకాన్ని ఇంగ్లీష్ నోట్ బుక్ లో దాచేసి, లెఖ్ఖల పుస్తకం తీశాను, నాన్నగారి అడుగుల చప్పుడు విని.

"ఏం లెఖ్ఖ చేస్తున్నావు?" నాన్నగారి గంభీరమైన కంఠం. తడబడుతూ "ఆల్జీబ్రా" అని "ఏ స్క్వేర్ మైనస్ బీస్క్వేర్ ఈస్ ఈక్వల్ టు.."అంటూ గట్టిగా చదవబోతుంటే, "లెఖ్ఖలు చెయ్యి, చదవఖ్ఖర్లేదు.." అంటూ అక్కడే ఉన్న నర్సరావుపేట పడక్కుర్చీలో కూర్చున్నారు. నేను చచ్చినట్లు లెఖ్ఖల హోంవర్క్ చెయ్యడం మొదలుపెట్టాను, మనసంతా అసిస్టెంట్ రాజు మీదే ఉండగా.

అవి నేను గుంటూర్ లో బి.హెచ్. స్కూల్లో ఫిఫ్త్ ఫారం చదువుతున్న రోజులు. హాఫ్ ఇయర్లీ పరీక్షల్లో మూడో రాంక్ వచ్చిందని ధీమాగా, రెట్టింపు ఉత్సాహంతో ఎడాపెడా డిటెక్టివ్ నవల్లు చదివేస్తూ, సాయంత్రాలు స్కూలు అవగానే స్కూల్లో ఉన్న గ్రౌండ్ లో చీకటి పడేవరకూ కుందుళ్ళు, వీపుదెబ్బలు.. ఆటలు ఆడుకుని, ఇంటికెళ్ళి అన్నంతిని ఎనిమిదన్నా అవకుండా హాయిగా పక్కెక్కేసి పవళించేదాన్ని. అమ్మకి వంటింట్లో పని చెయ్యడం, సాయంత్రాలు ఓంకారక్షేత్రం లో పురాణానికి వెళ్ళడం తప్ప నాచదువు గురించి పెద్దపట్టేది కాదు. ఒక వేళ పట్టినా మనం వినిపించుకోంకదా! అయినా ఆవిడ దృష్టిలో ఆడపిల్ల స్కూల్ ఫైనల్ పాసవుతే చాలు. దానికి ఢోకా లేదుకదా!

ఒక రోజు తెలుగు క్లాస్ లో, "హెచ్.యం గారు పిలుస్తున్నారు." క్రిష్ణవేణీ టీచరు నా ప్రక్కకి వచ్చి చెప్పారు. మా హెచ్.యం. లీలా మేడం అంటే మాకందరికి హడల్. సోషల్ స్టడీస్ ఎంతో బాగా చెప్పేవారు. ఎవర్నీ ఏమీ అనకపోయినా ఆవిడ అలా వెళ్తుంటే మేము కనిపించకుండా తప్పుకునేవాళ్ళం. నేను లేచి, కాళ్ళూ చేతులూ వణుకుతుంటే హెచ్.యం. గారి గది కేసి నడిచాను. నావెనుకే నేను ఆరాధించే క్రిష్ణవేణీ టీచర్. గదిలోకి వెళ్తూనే కాళ్ళు నేలకి అతుక్కుపోయినట్లు ఆగిపోయాను. టీచర్ నన్ను తప్పించుకుని లోపలికి వెళ్ళారు.

హెచ్.యం. గారి ఎదురుగా కుర్చీలో నాన్నగారు.. ఆవిడ చేతిలో డిటెక్టివ్ నవల. ఒక్కసారి నాలిక్కరుచుకున్నాను. నిన్నరాత్రి నాన్నగారు చూశారన్నమాట. పైగా ఇంగ్లీష్ నోట్ బుక్ ఇంట్లో మర్చిపోయా. నాన్నగారు ఏమీ అనలేదు. హెచ్.యం. గారు మాత్రం, "ఏమ్మా! డిటెక్టివ్ నవల్లు చదువుతే మూడోరాంక్ వచ్చింది కద! క్లాస్ బుక్స్ చదువుతే ఏంవస్తుందో ఒక్కసారి ఆలోచించు." అని క్రిష్ణవేణీ టీచర్ ఎదురుగా రంగుల అట్టున్న ఆచిన్నపుస్తకాన్ని నాచేతిలో పెట్టారు. ఒక్కసారి నాకేసి చూసి నాన్నగారు లేచి బైటికి వెళ్ళిపోయారు, "వస్తానండీ" అని హెచ్.యం. గారికి చెప్పి.

అంతే..ఆతర్వాత, ఫిఫ్త్ ఫారం లోనూ, యస్. యస్. యల్. సీ. లోనూ కూడా నాదే స్కూల్ ఫస్ట్. నాన్నగారి మౌనం నా జీవితాన్ని మలుపుతిప్పింది. ఆతర్వాత ఎప్పుడూ "అమ్మో! నాన్నగారు వస్తున్నారు." అనుకోలేదు. తలుచుకున్నప్పుడల్లా ఆపెలకట్టలేని ప్రేమకి కళ్ళు తడి అవకుండా ఉండవు.

***